సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం, 1, నవంబర్, 2023

చల్లంగాచూడు తల్లీ

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటిల్లిపాదిని చల్లంగా చూడాలని ఒడిబియ్యం, కల్లుసాక ఇతర కానుకలు సమర్పించారు. దీంతో బద్దిపోచమ్మ గుడి ప్రాంతం రద్దీగా మారింది. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



న్యూస్‌రీల్

పటేల్ సేవలు ఎనలేనివి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

సిరిసిల్ల: దేశానికి సర్దార్ వల్లాభాయ్ పటేల్ చేసిన సేవలు ఎనలేనివని అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ అన్నారు. దేశ తొలి ఉప ప్రధాని, స్వాతంత్య్ర సమరయోధుడు వల్లాభాయ్ పటేల్ 148వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం ఏక్తా దివస్ వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ కలెక్టరేట్ సిబ్బందితో రాష్ట్రీయ ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, డీపీఆర్వో మామిండ్ల దశరథం, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులో ఆసరా పింఛన్ దరఖాస్తులు



డంపింగ్‌యార్డు వద్ద ఆసరా పింఛన్ల దరఖాస్తులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఆవునూర్‌లో ఆసరా పింఛన్ల దరఖాస్తులు డంపింగ్‌యార్డులో మంగళవారం ప్రత్యక్షం అయ్యాయి. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఘటన వివరాలు.. ఆవునూర్‌లో ఇటీవల ఆసర పింఛన్ల కోసం గ్రామపంచాయతీ వారు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో ఆశతో వందలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా డంపింగ్ యార్డు సమీపంలో దరఖాస్తులు ప్రత్యక్షం కావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులను చెత్త కుప్పల్లో వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ లలిత డిమాండ్ చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ మాట్లాడుతూ, ఆసర పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టంచేశారు. సదరు దరఖాస్తులు డంపింగ్‌యార్డు వద్దకు ఎలా చేరాయో తెలియదని వివరించారు.


సిరిసిల్లలో నేడు బీఎస్పీ బహిరంగ సభ



సిద్ధమవుతున్న సభా వేదిక

సిరిసిల్ల: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) బుధవారం సిరిసిల్ల కళాశాల మైదానంలో బహిరంగ సభను నిర్వహించనుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి సాయంత్రం సభను ఏర్పాటు చేశారు. సభకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర నాయకులు, సిరిసిల్ల బీఎస్పీ అభ్యర్థి పిట్టల భూమేశ్, వేములవాడ అభ్యర్థి గోలి మోహన్, పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష తదితరులు హాజరుకానున్నారు. జిల్లాలో సిరిసిల్ల నుంచి బీఎస్పీ ఎన్నికల ప్రచారానికి బహిరంగ సభతో శ్రీకారం చుడుతుంది. సభా వేదిక ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, లింగంపల్లి మధుకర్, మేకల మునీందర్ మంగళవారం పరిశీలించారు. విద్యానగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం నుంచి గాంధీచౌక్ మీదుగా అంబేద్కర్ సర్కిల్, జూనియర్ కళాశాల మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీఎస్పీ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేదప్రజల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల చౌక్‌లో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతిని జరిపారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, మాజీ ఫ్లోర్‌లీడర్ యెల్లె లక్ష్మీనారాయణ, నూర దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు

- చిరుతల దాడిలో నష్టపోయిన రైతుల వేదన
- ఏడాదిలో 45 సంఘటనలు
- 55 జీవాల మృతి
- పోస్టుమార్టంతోనే సరిపెడుతున్న అధికారులు
- జిల్లాలో ఏడు చిరుతల సంచారం



'ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు జంగ అశోక్. తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట. గ్రామ శివారులో పశువుల పాకలో కట్టేసిన తన లేగదూడపై చిరుతపులి దాడిచేసి హతమార్చింది. అధికారులు వెళ్లి పోస్టుమార్టం చేసి నివేదిక ప్రభుత్వానికి సమర్పించారు. పరిహారం కోసం నాలుగుసార్లు అటవీశాఖ కార్యాలయం చుట్టూ తిరిగినా ఇప్పటికీ అందలేదు'.



చిరుత సంచరించిన ఆనవాళ్లు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లోని గొర్రెలు, దూడలపై చిరుతల దాడి ఇటీవల పెరిగింది. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో ఆరునెలల్లో 45 సంఘటనల్లో దాదాపు 55 జీవాలు ప్రాణాలు కోల్పొయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అటవీశాఖ అధికారులు పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు ఇస్తున్నా పరిహారం అందిన దాఖలాలు లేవు.



చిరుత దాడిలో మృతి చెందిన లేగదూడ(ఫైల్)

వరుసదాడులతో ఆందోళన

ఇల్లంతకుంటలోని చిట్టాపూర్, వల్లంపట్ల, ఒబులాపూర్, వెల్జీపూర్, అనంతారం, పెద్దలింగాపూర్, రంగంపేట గ్రామాల్లో చిరుతల దాడిలో 20 లేగదూడలు ప్రాణాలు కోల్పోయాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల, కంచర్ల, రంగంపేట, ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి, వెంకటాపూర్, కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్, మలక్పేట, ధర్మారం గ్రామాల్లోనూ చిరుతల దాడిలో లేగదూడలు చనిపోయాయి. మద్దిమల్ల, అక్కపల్లిల్లో గొర్రెల మందపై దాడిచేసి ఆరు జీవాల ప్రాణాలు తీశాయి. చిరుతల సంచారంతో రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

7 చిరుతలు.. 45 సంఘటనలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు పెద్దవి.. మూడు పిల్ల చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కరోజులో 50 కిలోమీటర్ల వరకు వేగంగా సంచరించే చిరుతలు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో జీవాలపై దాడి చేసి ఆహారంగా తీసుకుంటున్నాయి. చిరుతల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారే తప్ప.. వాటిని కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు. నష్టపోయిన బాధితుల వేదనలు వినే అధికారులు కరువయ్యారు. సంఘటన జరిగిన రోజే నివేదికలు తయారు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటవీశాఖ నుంచి మాత్రమే పరిహారం అందుతుందని అధికారులు పేర్కొంటున్నారు. రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో జరిగిన ఘటనలకు అసలు పరిహారమే రాదని చెబుతున్నారు. ఎలుగుబంట్ల దాడిలో గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన వారికి మాత్రమే ప్రభుత్వం తరపున పరిహారం అందుతుందంటున్నారు. బాధితులు మాత్రం పరిహారం అందుతుందనే ఆశతోనే నిరీక్షిస్తున్నారు.

రిజర్వు ఫారెస్టు ఘటనలకు పరిహారం రాదు



అనుమతి లేకుండా రిజర్వు ఫారెస్టులను చదునుచేసి అక్కడ వ్యవసాయం చేస్తూ లేగ దూడలను కట్టివేస్తున్న రైతులకు ప్రభుత్వం తరపున పరిహారం రాదు. కొందరు అనుమతి లేని ప్రాంతాలకు వెళ్లి పశువులు, గొర్రెలను మేపుతున్నారు. ఆ సమయంలో జరిగే దాడులకు పరిహారం అందించలేం. ఏడాది క్రితం జరిగిన కొన్ని ఘటనల్లో రైతులకు పరిహారం వచ్చింది. ఎలుగబంట్ల దాడిలో గాయపడినవారికి రూ.25వేల చొప్పున అందించాం.

– బాపిరాజు, సెక్షన్ అధికారి, ఎల్లారెడ్డిపేట

విద్యావంతులను బరిలో దించిన బీఎస్పీ




దాసరి ఉష | నిశాంత్ కార్తికేయగౌడ్ | ఏ.నరేశ్ యాదవ్ | పిట్టల భూమేశ్ | గోలి మోహన్



పల్లె ప్రశాంత్‌గౌడ్ | కొంకటి శేఖర్ | నిషాని రాముచంద్రం | నక్క విజయ్‌కుమార్ | బి.మల్లేశ్‌యాదవ్

- 10 మందిని ఖరారు చేసిన హైకమాండ్
- తమతోనే సామాజిక మార్పు అంటున్న అభ్యర్థులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల సమరంలో ఏనుగు పార్టీ దూకుడు పెంచింది. ప్రధాన పార్టీలకు దీటుగా అభ్యర్థులను ఎంపిక చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు కసరత్తు చేస్తోంది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 స్థానాలకుగాను రెండు విడతల్లో 10 మంది అభ్యర్థులను ప్రకటించింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా బీఎస్పీ అభ్యర్థుల ఎంపికలో ఉన్నత విద్యావంతులు, యువతకు పెద్దపీట వేశారు. జనం నాడి పట్టుకొని, రాజకీయాల్లో తమ భవితవ్యాన్ని పరీక్షించుకునేందుకు వీరంతా సిద్ధమవుతున్నారు. సామాజిక మార్పు తమతోనే అంటూ తమతమ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్, మంథని అసెంబ్లీ స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన వారిలో గౌడ్స్–2, యాదవ్–2, ముదిరాజ్–1, ఎస్సీ–3, మున్నూరు కాపు–1, పద్మశాలీ–1(మహిళకు) బీఎస్పీ సీట్లు కేటాయించింది.

ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం..

పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. దాసరి హనుమయమ్మ ట్రస్టు ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రామగుండం నుంచి బరిలో నిలిచిన అంబటి నరేశ్‌యాదవ్ సింగరేణి ఉద్యోగం వదిలిపెట్టి, ఆర్ఎఫ్‌సీఎల్ సహా సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ ఇటీవల బీఎస్పీలో చేరారు. వేములవాడ అభ్యర్థి గోలి మోహన్ అమెరికాలో శాస్త్రవేత్తగా పని చేశారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి, సేంద్రియ సాగు వైపు అన్నదాతలను ప్రోత్సహించేలా, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల అభ్యర్థి మల్లేశ్‌యాదవ్ ఎంపీటీసీ సభ్యుడిగా, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. కోరుట్లలో కార్తికేయగౌడ్ తన తల్లి జెడ్పీటీసీగా పని చేయటంతో ఆమె బాటలోనే రాజకీయాల్లో ప్రవేశించారు. సిరిసిల్ల నుంచి పిట్టల భూమేశ్ రాష్ట్ర సర్పంచ్ ఫోరం సలహాదారుగా, పలు ప్రజాసమస్యలపై పోరాటాలతో గుర్తింపు పొందారు. ధర్మపురి అభ్యర్థి నక్క విజయ్‌కుమార్ టీ–మాస్(తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక) జగిత్యాల చైర్మన్‌గా, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు.

బీఎస్పీ అభ్యర్థుల విద్యార్హతలు

దాసరి ఉష (పెద్దపల్లి)
– బీటెక్, ఐఐటీ, ఖరగ్‌పూర్
నిశాంత్ కార్తికేయగౌడ్ (కోరుట్ల)
– బీసీఏ, ఎంఏలో ఫిల్మ్ మేకింగ్
అంబటి నరేశ్‌యాదవ్ (రామగుండం)
– పీజీలో రాజనీతిశాస్త్రం
పిట్టల భూమేశ్‌ముదిరాజ్ (సిరిసిల్ల)
– ఎల్ఎల్‌బీ
గోలి మోహన్ (వేములవాడ)
– ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ
పల్లె ప్రశాంత్‌గౌడ్ (హుజూరాబాద్)
– ఎంఏ ఎల్ఎల్‌బీ
కొంకటి శేఖర్ (చొప్పదండి)
– ఎంఎస్సీ బీఈడీ
నిషాని రామచంద్రం (మానుకొండూర్)
– ఎల్ఎల్‌బీ
నక్క విజయ్‌కుమార్ (ధర్మపురి)
– ఏవియేషన్ డిప్లొమా
బల్కం మల్లేశ్‌యాదవ్ (జగిత్యాల) – ఎస్ఎస్‌సీ

వచ్చేనెల మొదటివారంలోగా పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మొక్కలు పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని మొదటి, రెండో బైపాస్ రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలకు నీరు అందిస్తూ సంరక్షించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. బైపాస్ రోడ్లను మంగళవారం సాయంత్రం పరిశీలించి మాట్లాడారు. సిరిసిల్ల శివారుల్లోని జంక్షన్ల అభివృద్ధి పనులు డిసెంబర్ మొదటి వారంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ సరిగ్గా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫాసత్‌అలిబేగ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అన్సార్, ఈఈ ప్రసాద్ ఉన్నారు.

శిక్షణను పరిశీలించిన కలెక్టర్

సిరిసిల్ల గీతానగర్ స్కూల్‌లో జరుగుతున్న ఎన్నికల అధికారుల శిక్షణను కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. నిబంధనలను కూలంకషంగా చదివి పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలని కోరారు.

మహారాజ చైర్ రూ.500.. వీఐపీ చైర్ రూ.275

- చికెన్ బిర్యానీ రూ.140, మటన్ బిర్యానీ రూ.180
- ధరలు నిర్ణయించిన జిల్లా ఎన్నికల అధికారి
- గరిష్టంగా చేయాల్సిన వ్యయం రూ.40 లక్షలే..

సిరిసిల్ల: మహారాజ చైర్‌కు రూ.500, వీఐపీ చైర్‌కు రూ.275, చికెన్ బిర్యానీ రూ.140.. మటన్ బిర్యానీకి రూ.180.. టపాసులు కిలో రూ.600.. డప్పు కొట్టేకళాకారుడికి రూ.500, కళాబృందం కళాకారుడికి రూ.300 ఇవేం రేట్లు అనుకుంటున్నారా..? ఇవి శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బరిలో నిలిచే అభ్యర్థుల ప్రచార ఖర్చుల ధరలు. ఒక్కో దానికి ఒక్కో ధరను జిల్లా ఎన్నికల అధికారులు ఖరారు చేశారు. ఈ మేరకు 58 రకాల సేవల కిరాయి(అద్దె) రేట్లను, కొనుగోలు ధరలను నిర్ణయించారు. పేపర్ ప్లేట్ల నుంచి టెంట్ సైడ్ వాల్ వరకు, జెండాలు, కండువాలు, కూల్‌డ్రింకులు, సోఫాలు ఇలా అన్ని ధరలను ముందే ప్రకటించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ నేతృత్వంలో కమిటీ దేనికి ఎంత వ్యయం చేయాలో సూచించింది.

ధరలు తగ్గించే వీలు లేకుండా..

గత ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చులను చాలా తక్కువగా చూపించేవారు. కానీ ఈ సారి ఆ అవకాశం లేకుండా ముందే ధరలు నిర్ణయించడం విశేషం. ఎన్నికల అధికారులే ధరల జాబితా రెడీ చేశారు. దాని ప్రకారం ఎన్నికల వ్యయాన్ని లెక్కించనున్నారు. ఈసారి వ్యయాన్ని ఎన్నికల సంఘం పెంచింది. అభ్యర్థి ఖర్చులు గరిష్టంగా గతంలో రూ.28 లక్షలు ఉండగా, ఈసారి రూ.40 లక్షలు చేసింది. దీంతో ముందే ఎన్నికల ప్రచార ఖర్చుల రేట్లను నిర్ధారించారు.

స్వేచ్ఛగా ఓటెయ్యాలి



ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముస్తాబాద్, నామాపూర్, పోతుగల్, గూడెం, ఆవునూర్ గ్రామాల్లో పోలీస్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు ఏ పాటి వాడో చూడు. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు. ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు. పెట్టుకునే టోపీ కాదు.. పెట్టిన టోపీ చూడు.

– కాళోజీ

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షించారు. ప్రతీ అధికారి, సిబ్బంది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ నెల 3 నుంచి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నేర చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలతో క్రిటికల్ కేంద్రాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని పేర్కొన్నారు.

అక్రమ ధనానికి అడ్డుకట్ట

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుంచి జిలాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.43,33,475 నగదు, 1,033.35 లీటర్ల మద్యం, 9 కిలోల 450 గ్రాముల గంజాయి, రూ.1,37,035 విలువగల వస్తువులను సీజ్ చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 281 కేసుల్లో 785 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెస్ సామగ్రి ఇతరుల చేతుల్లో?

- పట్టించుకోని అధికారులు



ప్రైవేటు స్థలంలో సెస్ విద్యుత్ వైర్ కట్టలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల విద్యుత్ సహకార సంఘం లిమిటెడ్ (సెస్) ఇప్పటికే మొండి బకాయిలతో కొట్టుమిట్టాడుతోంది. దీనికి తోడు సెస్‌కు సంబంధించిన విలువైన పరికరాలు, విద్యుత్ వైర్లు ఇతరుల చేతుల్లోకి వెళుతున్నాయి. వాస్తవంగా సెస్ స్టోర్‌లో మాత్రమే ఈ విలువైన పరికరాలు, విద్యుత్ వైర్ బెండల్స్ ఉండాల్సి ఉండగా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఒక ఉడెన్ ఫర్నీచర్ షాపులో 'సాక్షి' కెమెరా కంటపడ్డాయి. ఈ విషయమై సెస్ చైర్మన్ చిక్కాల రామారావును వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీఆర్ఎస్‌కు అండగా ఉండాలి



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

సిరిసిల్ల: దేశంలోని 16 రాష్ట్రాల్లో బీడీ పరిశ్రమ ఉండగా, ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ బీడీ కార్మికులకు, టేకేదార్లకు జీవనభృతి ఇచ్చారని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మంగళవారం జిల్లాలోని బీడీ కంపెనీ టేకేదార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సాధించి గత తొమ్మిదేళ్లలో ఎంతో తేడా వచ్చిందని అవన్నీ మీ కళ్ల ముందు కనిపిస్తున్నాయని స్పష్టం చేశారు. తెలంగాణను బంగారు తునకలా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారని వివరించారు. బీఆర్ఎస్‌కు అండగా ఉండి, సిరిసిల్లలో కె.తారక రామారావుకు, వేములవాడలో లక్ష్మీనర్సింహారావు కారు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. సమావేశంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్, భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు వెంగళ శ్రీనివాస్, బీడీ కంపెనీ టేకేదార్ల సంఘం నాయకులు అడ్డగట్ల మురళి, చిలుక నారాయణ, శ్రీరాం దశరథం, మ్యాన వెంకటేశం, అడ్డగట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బీడీ టేకేదార్ల మద్దతు

ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా రాష్ట్ర బీడీ టేకేదారుల సంక్షేమ సంఘం మంగళవారం తీర్మానం చేసింది. తీర్మానం లేఖను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్‌కు సిరిసిల్ల బీఆర్ఎస్ ఆఫీస్‌లో అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టేకేదారులు, బీడీకార్మికులు, ప్యాకర్లు, చేకర్లు, భట్టివాలా, తునికి ఆకు సేకరణ దారులు కలిపి మొత్తం ఆరు లక్షల మంది ఉన్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల నారాయణ, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి ఐలారెడ్డి వెల్లడించారు.

మీకు తెలుసా..?

జెండాగద్దె లేని 'గంగిపల్లి'



మానకొండూర్: ప్రతీగ్రామంలో వివిధ రాజకీయ పార్టీల జెండాలు స్వాగతం పలుకుతుంటాయి. జెండా గద్దెల ఏర్పాటులో చిన్నపాటి యుద్ధాలే జరుగుతుంటాయి. అయితే కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లి గ్రామంలో ఇప్పటి వరకు ఒక్క రాజకీయ పార్టీ జెండా గద్దె లేకపోవడం విశేషం. గంగిపల్లి నుంచి పేరున్న నేతలు పొలిటికల్‌గా రాణిస్తున్నారు. అయినా.. గ్రామ ప్రజల్లో ఉన్న ఐక్యత వీరి సామరస్యతకు చిహ్నంగా నిలుస్తోంది. మాజీ మంత్రులు ఎమ్మెస్సార్, చొక్కారావు, చెన్నమనేని విద్యాసాగర్‌రావు వంటి నేతలతో గ్రామస్తులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన కనకం నర్సయ్య నుస్తులాపూర్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గ్రామంలో ఐదువేల జనాభా, రెండు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. రాజకీయ పార్టీల జెండాగద్దెల నిర్మాణాలతో ఇబ్బందులు ఉంటాయని, కలిసిమెలసి ఉన్నవాళ్ల మధ్య జెండా గద్దెల చిచ్చువద్దనుకుని ఏళ్లక్రితం గ్రామపెద్దలు నిర్ణయం తీసుకున్నారు. వారి నిర్ణయాన్ని ఇప్పటికీ పాటిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు గంగిపల్లి గ్రామస్తులు.

క్లుప్తంగా

ఉద్యోగ సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు

- రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్



దుర్గయ్య దంపతులను సన్మానిస్తున్న ఈవో కృష్ణప్రసాద్, అధికారులు

వేములవాడ: ఉద్యోగంలో చేసిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అన్నారు. ఆలయంలో సేవాదారుగా విధులు నిర్వహించి, రిటైరైన పెంట దుర్గయ్య దంపతులను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం డీఎస్పీ పోరాటం



మాట్లాడుతున్న సాధన

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో అగ్రవర్ణాల పాలనను అంతం చేసి, బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారం కోసం ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) పోరాటం చేస్తుందని ఆ పార్టీ చొప్పదండి అభ్యర్థి జంగం సాధన అన్నారు. బోయినపల్లి మండలంలోని మర్లపేట గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆధ్వర్యంలో అణగారిన వర్గాల ప్రజలు ఓటు అనే ఆయుధంతో సొంత రాజ్యం నిర్మించుకోవాలని కోరారు. ఆమె వెంట నాయకులు ఎడపెల్లి బాబు, కుర్మ సురేశ్, సంజీవ్, రాజేశ్, కుడుకల మధు, కోరెపు మహేశ్, అనిల్ తదితరులున్నారు.

బీజేపీ అభ్యర్థిత్వంపై పునరాలోచించాలి



భాస్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న వాసు

సిరిసిల్లటౌన్: బీసీల జనాభా అధికంగా ఉన్న సిరిసిల్ల నియోజకవర్గానికి ప్రకటించిన అభ్యర్థిత్వంపై అధిష్టానం పునరాలోచించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గౌడ వాసు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిరిసిల్ల నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలు, అందులో మెజార్టీ ప్రజలు పద్మశాలీలున్నారన్నారు. ఈక్రమంలో స్థానిక బీసీలకు అభ్యర్థిత్వం ఇవ్వడం సమంజసమని అన్నారు. ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థి విషయంలో పునరాలోచించాలని కోరినట్లు వెల్లడించారు. ఆయనతో పాటు నాయకులు గుండెల్లి వేణు, శ్రీనివాస్, స్వామి, అర్జున్ తదితరులున్నారు.

'ఎన్నికలకు వినియోగించడం సరికాదు'

వేములవాడ: రాజన్న క్షేత్రానికి సంబంధించిన లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌ను ఎన్నికలకు వినియోగించడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఒక ప్రకటనలో అన్నారు. కార్తీకమాసం ప్రారంభంతోపాటు సమ్మక్క జాతర నేపథ్యంలో భక్తుల రద్దీ పెరుగుతోందని తెలిపారు. చలిలో వారు ఎక్కడ తలదాచుకుంటారని, ఆలయ ఉద్యోగులను ఎన్నికల విధులకు కేటాయించడం వల్ల భక్తులకు ఎవరు సేవలందిస్తారని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

గల్లీ టు ఢిల్లీ

- పరిషత్ నుంచి పార్లమెంటు వరకు
- ఎంపీపీ, జెడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యేలుగా..
- కౌన్సిలర్, కార్పొరేటర్ నుంచి చట్ట సభల్లోకి
- రాజకీయంగా రాణిస్తున్న ఉమ్మడి జిల్లా నేతలు

కరీంనగర్: రాజకీయ జీవితం వృక్షం లాంటిది. విత్తనం వేసిన రోజునుంచి దాన్ని కాపాడుకుంటూ వస్తేనే మానై నీడనిస్తుంది. రాజకీయం కూడా అంతే.. వేసిన తొలి అడుగు నుంచి వెనక్కి చూడకుండా.. గెలుపోటములకు భయపడకుండా ముందుకు సాగితేనే విజయం వరిస్తుంది. గల్లీలో ప్రారంభమైన విజయం ఢిల్లీ వరకు తీసుకెళ్తుంది. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వివిధ పార్టీల నేతలు సర్పంచ్‌గా.. ఎంపీపీగా.. కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, నేడు అసెంబ్లీ, పార్లమెంటులో తమ గళాన్ని వినిపిస్తున్నారు. 1987లో జరిగిన మొదటి ఎంపీపీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు ఎంపీపీలుగా, జెడ్పీటీసీ సభ్యులుగా, కౌన్సిలర్, కార్పొరేటర్, పీఏసీఎస్ చైర్మన్‌లుగా తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నేతలు ఆ తర్వాత ప్రజల ఆశీస్సులతో చట్టసభల్లో అడుగు పెట్టారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తమదైన ముద్ర వేసుకున్నవారిలో కొందరిపై కథనం.



చాడ వెంకట్‌రెడ్డి, కటుకం మృత్యుంజయం, చింతకుంట విజయరమణారావు, బొడిగె శోభ



పొన్నం ప్రభాకర్, మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్, కోరుకంటి చందర్

అసెంబ్లీకి ఎన్నికైనవారు..

- సంజయ్ విచార్ మంచ్ నుంచి 1983లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలిచిన కటుకం మృత్యుంజయం మండల వ్యవస్థ ఏర్పడ్డాక ఓదెల జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు.
- కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన కేతిరి సాయిరెడ్డి 1989 శాసనసభ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు.
- కరీంనగర్ ఎంపీపీగా పని చేసిన జువ్వాడి చంద్రశేఖర్‌రావు 1994లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- మంథని ఎంపీపీగా గెలిచిన చందుపట్ల రాంరెడ్డి 1994లో మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- సుల్తానాబాద్ ఎంపీపీగా గెలిచిన బిరుదు రాజమల్లు 1994లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- ప్రత్యక్ష పద్ధతిలో ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా, ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన సుద్దాల దేవయ్య 1994, 1999లో నేరెళ్ల ఎమ్మెల్యేగా, 2009లో చొప్పదండి ఎమ్మెల్యేగా కొనసాగారు.
- ధర్మారం జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన గుజ్జుల రామకృష్ణారెడ్డి 1999లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- మూడు సార్లు చిగురుమామిడి ఎంపీపీగా, ఒకసారి జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి 2004లో ఇందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై, సీపీఐ శాసనసభాపక్ష నేతగా పని చేశారు.
- మానకొండూరు జెడ్పీటీసీ సభ్యుడిగా, జెడ్పీ చైర్మన్‌గా కొనసాగిన ఆరెపల్లి మోహన్ 2009లో మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- శంకరపట్నం జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిచిన బొడిగె శోభ 2014లో చొప్పదండి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- జూలపల్లి జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన చింతకుంట విజయరమణారావు 2009లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయం అందుకున్నారు.
- మంథని ఎంపీపీగా, జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసిన పుట్ట మధు 2014లో మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- జూలపల్లి జెడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న కాశిపేట లింగయ్య 2004లో నేరెళ్ల ఎమ్మెల్యేగా గెలిచారు.
- సింగిల్‌విండో చైర్మన్‌గా పని చేసిన పొన్నం ప్రభాకర్ కరీంనగర్ ఎంపీగా 2009లో పార్లమెంటులో అడుగుపెట్టారు.

కార్పొరేటర్ స్థాయి నుంచి..

- కరీంనగర్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన కఠారి దేవేందర్‌రావు 1999లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- కరీంనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు విజయం సాధించిన మంత్రి గంగుల కమలాకర్ కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పని చేశారు.
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కార్పొరేటర్‌గా పని చేశారు.
- రామగుండం మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన సోమారపు సత్యనారాయణ రామగుండం ఎమ్మెల్యేగా కొనసాగారు.
- వేములవాడ జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచిన గొడిశాల రాజేశంగౌడ్ జెడ్పీ చైర్మన్‌గా, జగిత్యాల ఎమ్మెల్యేగా, ఎన్టీఆర్ కేబినెట్‌లో గృహ నిర్మాణశాఖ మంత్రిగా పని చేశారు.

రాజన్న సేవలో నటేశ్వరశర్మ



స్వామివారి ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ: వేములవాడ రాజన్నను మంగళవారం సంస్కృతాంధ్ర విద్వత్కవి, శతావధాని, దాశరథి సాహితీ పురస్కార గ్రహీత డాక్టర్ ఆయాచితం నటేశ్వరశర్మ దంపతులు దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం వారికి నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనం గావించి ప్రసాదం అందజేశారు.

టీచర్‌కు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న చందన

సిరిసిల్ల కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చందనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం వర్సిటీలో పట్టా అందజేశారు. హిందీలో బాల సాహిత్యంపై చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ ప్రకటించినట్లు ఆమె తెలిపారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, అడోబ్ సీఈవో శాంతన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- ఎస్పీ అఖిల్ మహాజన్
- సిరిసిల్లలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీసులు

సిరిసిల్ల క్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసులు మంగళవారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తా, నేతన్న చౌక్, గాంధీ చౌక్ వరకు బైక్ ర్యాలీ, అక్కడి నుంచి టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. అనంతరం పోలీస్ అమరవీరులకు నివాళి అర్పించారు. ప్రజా రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకుసాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. దేశవ్యాప్తంగా అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేలా ఏటా పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయసాధన కోసం సమాజంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్, రక్తదాన శిబిరం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

రాజన్న ఆలయానికి ట్రాక్టర్ వితరణ



ట్రాక్టర్ అందజేస్తున్న వెంకట్‌సాయి ఎంటర్‌ప్రైజెస్ బాధ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు మంగళవారం కరీంనగర్‌కు చెందిన వెంకట్‌సాయి ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జాన్ డీర్ ట్రాక్టర్ డీలర్షిప్) రూ.8 లక్షల విలువ గల ట్రాక్టర్, ట్రాలీని విరాళంగా అందజేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.సత్యశేఖర్ మాట్లాడుతూ, తమ సంస్థ 50 వేల ట్రాక్టర్లు అమ్మిన సందర్భంగా రాజన్నకు చిరు కానుక అందజేస్తున్నట్లు చెప్పారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేశ్, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాప నవీన్, ఏఈ డి.శేఖర్, పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, అర్చకులు నమిలికొండ రాజు, దోమల నాగరాజు, జాన్‌డీర్ కంపెనీ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ రమాకాంత్ గార్గ్, జోనల్ మేనేజర్ నవీన్ సెంగర్, జనరల్ మేనేజర్ కైలాష్ తదితరులున్నారు.

అమ్మ లేదన్న బెంగతో ఆగిన గుండె

- గుండెపోటుతో యువకుడి మృతి
- 13 రోజుల్లో తల్లీకుమారుడు అనంతలోకాలకు..

సిరిసిల్లటౌన్: అమ్మ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందని ఆ యువకుడు బెంగ పెట్టుకున్నాడు.. నిత్యం దిగాలుగా ఉంటూ హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన సిరిసిల్లలో విషాదం నింపింది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన చెన్న శ్రీనివాస్(36) హోటల్ నిర్వాహిస్తున్నాడు. అతని తల్లి రుక్కుంబాయి అనారోగ్యంతో 13 రోజుల క్రితం చనిపోయింది. అప్పట్నుంచి శ్రీనివాస్ తల్లిపై బెంగతో దిగులుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతిచెందాడు. అతని అన్న దత్తు ఐదేళ్ల క్రితం విద్యుదాఘాతంతో చనిపోయాడు. భార్య, ఇద్దరు కుమారుల మృతితో దివ్యాంగుడైన భూమయ్య రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.



శ్రీనివాస్ మృతదేహం

దొంగతనం కేసుల్లో ముగ్గురికి జైలు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు నెలల క్రితం సగాల్ల దేవయ్య, సంది నారాయణ రెడ్డి తమ వాహనాలను వేర్వేరు ప్రాంతాల్లో పార్కింగ్ చేశారు. పనులు ముగించుకొని వచ్చి చూసేసరికి అవి కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన నిమిషకని ప్రణీత్‌గా గుర్తించి రిమాండ్ తరలించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి అతనికి 2 నెలల 10 రోజుల సాధారణ జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

సిరిసిల్ల సర్దార్ నగర్‌లో..

1 సెప్టెంబర్ 2022న సిరిసిల్లలోని సర్దార్ నగర్‌కు చెందిన ఏనుగుల శరత్‌కుమార్ తన ఇంట్లో దొంగతనం జరిగిందని, ల్యాప్‌టాప్, చెవికమ్మలు, ఉంగరాలు తదితర వస్తువులు పోయాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వడ్డేపల్లి సత్యం, దండుగుల లక్ష్మిలను అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించారు. అనంతరం చార్జిషీట్ దాఖలు చేయగా కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ దొంగలిద్దరికీ 13 నెలల 15 రోజుల జైలుశిక్షతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సామల మల్లేశం



మాట్లాడుతున్న మల్లేశం

సిరిసిల్లటౌన్: పోరాటాలతోనే కార్మిక హక్కులను సాధించుకోవచ్చని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సామల మల్లేశం అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం సిరిసిల్ల కార్మిక భవన్‌లో నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో కార్మికులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేళ్ల ఏఐటీయూసీ పోరాటంలో అనేక మంది నాయకులు అమరులయ్యారని తెలిపారు. వారి పోరాట స్ఫూర్తితో కార్మికులు ముందుకెళ్లాలని సూచించారు. దేశంలో అన్ని రంగాల కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పంతం రవి, నల్ల చంద్రమౌళి, కదారి రాములు, అజ్జ వేణు, మీసం లక్ష్మణ్, శీలం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి(చొప్పదండి): అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలంలోని రత్నంపేటకు చెందిన గడ్డి మల్లేశం(65) ఆరేళ్ల క్రితం దుబాయి నుంచి వచ్చాడు. తర్వాత కొద్ది రోజులకే ఆయనకు పక్షవాతం వచ్చింది. కుటుంసభ్యులు కరీంనగర్, వేములవాడ ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, సోమవారం రాత్రి ఇంటి ఎదుట గల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం బావిలో మల్లేశం మృతదేహం కనిపించింది. పక్షవాతం వల్లే తన తండ్రి మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుమారుడు తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నాగరాజు (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): కిడ్నీలు చెడిపోయిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలంలోని గొల్లపల్లి(వట్టిమల్ల)కి చెందిన బండ నాగరాజు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి, అనారోగ్యంతో తిరిగి ఇంటికి వచ్చాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యులు అతని వైద్యం కోసం రూ.5 లక్షల వరకు వెచ్చించారు. సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య లాస్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య పరామర్శించారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వ్యక్తి బలవన్మరణం

జగిత్యాలక్రైం: లక్ష్మీపూర్‌కు చెందిన పిల్లి మల్లేశం (58) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లేశం కొద్దిరోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. మంగళవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు,. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

జర్మనీతో వ్యవసాయ ఒప్పందం ఖరారు

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



డా.సబస్టియన్ బొస్సెతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వాతావరణ మార్పులకు అనుగుణంగా సేద్యం చేసేందుకు భారత్– జర్మని సంయుక్త ప్రాజెక్టుకు జర్మనీలోని బెర్లిన్‌లో మంగళవారం ఒప్పందం కుదిరినట్లు రాష్ట్ర వ్యవసాయ ప్రధాన సలహాదారు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జర్మనీ పరిశోధన కేంద్రం ఫ్రాఅన్ హోఫర్ ప్రధాన సంచాలకుడు డా.సబస్టియన్ బొస్సెతో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు సమన్వయకర్తగా డా.రఘు చలిగంటి కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ సమతుల్యతకు నూతన విధానాల ద్వారా సంఖ్యల ఆధారిత సమాచారం (డేటా)తో తగు పరిష్కారాలు చూపించి రైతులకు ఆచరణయోగ్యం చేయడమే దీని లక్ష్యమన్నారు. 2021 నుంచి జర్మని వ్యవసాయ మంత్రిత్వ శాఖ, తెలంగాణ తెలంగాణ విత్తనరంగంలో పరిశోధన, ప్రపంచ విస్తరణ కార్యక్రమంలో విజయవంతంగా సహకరించుకుంటున్నాయని వివరించారు. దీని ఆధారంగా వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి మరో ప్రాజెక్టు అమలుపై కూడా చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మొదటి దశలో డిసెంబరు 2023 నుంచి ఒక మిలియన్ యూరో నిధులతో ప్రారంభం కానున్న ఈ ప్రాజెక్టును ఒకవైపు జర్మనీ వ్యవసాయ మంత్రిత్వశాఖ, తెలంగాణ వ్యవసాయ మంత్రిత్వ శాఖ మరోవైపు ప్రొత్సహిస్తుండగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయాధారిత పరిశోధనల కేంద్రం, జర్మనీలోని పరిశోధనల కేంద్రమైన ఫ్రాఅన్ హోఫర్ అమలు చేయబోతున్నట్లు తెలిపారు.

హత్యా రాజకీయాలు మానాలి

- నాఫ్స్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు



మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో బీజేపీ హత్యా రాజకీయాలకు తెరలేపిందని ఇది ఏమాత్రం సరికాదని నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. మంగళవారం సాయంత్రం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై బీజేపీ అనుచరుడు హత్యాయత్నానికి పాల్పడటాన్ని ఖండించారు. తొమ్మిదేళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుంచుతున్న కేసీఆర్ వెంటే ప్రజలున్నారని, ఈఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు.

గడపగడపకూ బీఆర్ఎస్

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకూ ప్రచారం చేస్తామని పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బుధవారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించాలని కార్యకర్తలు, నాయకులు కలిసి రావాలని కోరారు.సమావేశాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ చైర్మన్ గడ్డం నర్సయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు నర్సింగరావు, మల్లారెడ్డి, అగ్గి రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

- కాంగ్రెస్ వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్



శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

వేములవాడ: ఈనెలలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీ మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

చందుర్తి(వేములవాడ): రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చందుర్తి మండలం జోగాపూర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. జోగాపూర్, మూడపల్లి గ్రామాల్లో వార్డు సభ్యులతో పాటు యువకులు, మహిళలు కాంగ్రెస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేశ్, నాగం రాయమల్లు, ముస్కు ముకుందరెడ్డి, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బానాల రవీందర్‌రెడ్డి, గొట్టే ప్రభాకర్, పులి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పాలన సాధ్యమని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో గడపగడపకు ప్రచారం, పలువార్డుల్లో పార్టీలోకి చేరుతున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు ఆహ్వానసభలు నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు వంగరి దేవదాసు, 23వ వార్డుకు చెందిన లింగంపల్లి దేవయ్య ఆధ్వర్యంలో పెద్దెత్తున కార్యకర్తలు చేరారు. టీపీసీసీ కార్యవర్గసభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, గోలి వెంకటరమణ, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

అటవీ హక్కులు కల్పిస్తాం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గిరిజనులకు అటవీ ప్రాంతంపై పూర్తి హక్కులు కల్పిస్తామని మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గుగులోతు అనిల్, సునావత్ యాదగిరి, దుమాలకు చెందిన మల్యాల రమేశ్, అజ్మీరా లాల్‌సింగ్ కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులున్నారు.